


వైఎస్ఆర్

విమాన సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

కడప : విమాన సర్వీసులను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విమానాశ్రయం డైరెక్టర్ శివప్రసాద్ తెలియజేశారు. బుధవారం ఆయన విమాన సర్వీసుల వివరాలను వివరించారు. కడప నుంచి వయా హైదరాబాద్ నుంచి గోవా, తిరువనంతపురం, మదురై, భువనేశ్వర్, రాజమండ్రి, రాయపూర్, ఇండోర్, జబల్‌పూర్, ముంబై, చండీగర్, వారణాసి, భువనేశ్వర్, జైపూర్, సూరత్, రాంచీ, ఢిల్లీ. కడప వయా చెన్నై నుంచి వడోదర, కోయంబత్తూరు, మధురై, కోల్‌కతా, అహ్మదాబాద్, మైసూరు.కడప వయా బెంగళూరు నుంచి తిరుచిరాపల్లి, ఉదయ్‌పూర్, హుబ్లీ, లక్నోలకు సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. కడప-హైదరాబాద్‌కు రోజూ విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. కడప-విజయవాడ-కడప : సోమ, బుధ, శుక్ర, ఆదివారాలలో, చెన్నై-కడప-చెన్నై : సోమ, బుధ, శుక్ర, ఆదివారాలలో, బెంగళూరు-కడప-బెంగళూరు: మంగళ, గురు, శనివారాలు, కడప-విశాఖపట్నం-కడప : మంగళ, గురు, శనివారాల్లో ఉంటాయన్నారు. సర్వీసులను ఉపయోగించుకోవాలని డైరెక్టర్ తెలిపారు.

వామ్మో..జూన్..!



జూన్ వస్తోందంటే తల్లిదండ్రుల్లో వణుకు. ప్రాథమిక పాఠశాలల నుంచి ఇంటర్, డిగ్రీ కళాశాలలకు అకడమిక్ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సంగతి తెలిసిందే. పిల్లలకు ఫీజులు, హాస్టల్ ఖర్చులు తలుచుకుని తల్లిదండ్రులు వామ్మో... జూన్.. అంటూ ఆందోళన చెందుతుండడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్, అమ్మఒడి పథకాల అమలు కంటితుడుపు చర్యగా మారింది. ఫీజురీయింబర్స్‌మెంట్ ఆలస్యమైతే విద్యా సంస్థల యాజమాన్యాలు ముందుగానే ఫీజులు చెల్లించాలనే పేరుతో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా, హాస్టల్ ఫీజులు చెల్లిస్తేనే భోజనాలనే విధంగా వేధింపులకు గురిచేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్న ఫీజులకు, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు పొంతన లేకపోవడాన్ని గమనించాలి. సామాన్య కుటుంబాలకు పిల్లల చదువులు భారంగా మారాయి.

- ప్రయివేటు, కార్పొరేట్ ఫీజులపై ఆందోళన
- ఎల్‌కెజికి సైతం రూ.25 వేలకుపైనే ఖర్చు
- ఇంటర్, ఇంజినీరింగ్ విద్యకు రూ.3 లక్షలు
- ఫీజుల క్రమబద్ధీకరణ, చెల్లింపులపై నిఘా ఏదీ?
- దిక్కుతోచని స్థితిలో తల్లిదండ్రులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి కడప జిల్లాల్లో 2,200 ప్రభుత్వ పాఠశాలలు, 950 ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలు పాంశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 1,56,156 మంది, 950 ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలల్లో సుమారు 1.40 లక్షల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారింది. ఫలితంగా లక్షలాది మంది విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌కెజికి రూ.25 వేలకుపైగా చెల్లించాల్సిన దుస్థితి దాపురించింది. తరగతులు పెరుగుతున్నకొద్దీ భారం పెరుగుతూ వస్తోంది. 10వ తరగతి ప్రతి విద్యార్థికి రూ.90 వేల వరకు వసూలు చేస్తున్నారు. హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ అదనం. ఇద్దరు పిల్లల ఫీజులను లెక్కిస్తే ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.రెండు లక్షల చొప్పున ముట్టచెప్పాల్సి వస్తోంది. తల్లిదండ్రులిద్దరూ ఏడాది పొడవునా ఖర్చు చేసినా ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులకు అదనంగా అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు పిల్లలను ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లకు పంపిస్తున్న వైనం కనిపిస్తోంది. దీన్ని ఆసరా చేసుకున్న విద్యా సంస్థల యాజమాన్యాల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది.

ఇంటర్, డిగ్రీ, మేనేజ్‌మెంట్, ఫార్మాస్యూటికల్ చదువులు ఖరీదైన వ్యాపారంగా మారిపోయింది. నీట్, ఎంసెట్, జెఇఇ, జెఇఇ అడ్వాన్స్‌డ్ పోటీ పరీక్షలకు పెరిగిన ఆశల నేపథ్యంలో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన అనివార్యత ఏర్పడింది. కాంపిటీషన్ పరీక్షల్లో మెరుగైన ర్యాంకులు సాధిస్తేనే సీటు లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో యాజమాన్య కోటా కింద పెద్దఎత్తున లక్షలాది రూపాయలను ఫీజుల రూపంలో ముట్టచెప్పుకోవాల్సి వస్తోంది. డేస్కాలర్స్‌గా ప్రయివేటులో ఇంటర్ విద్య అభ్యసించడానికి ఏడాది లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. హాస్టల్‌లో చేరితే రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకు చెల్లించాల్సి ఉంటోంది. హాస్టల్ ఫీజు రూ.60 నుంచి రూ.80 వేలకుపైగానే ఉంటోంది. ప్రభుత్వం ఇచ్చే ఫీజురీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజులకే సరిపోతోంది. మిగిలిన డబ్బులు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోంది. ఇంజినీరింగ్ నాలుగేళ్ల కోర్సుకు అదనంగా రూ.నాలుగు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు ఏటా రూ.నాలుగు లక్షలు చొప్పున నాలుగేళ్లకు రూ.16 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. నీట్‌లో ఉచిత ఎంబిబిఎస్ సీటు సాధిస్తే రూ.రెండు లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఉచిత సీటు లభించకపోతే రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. మేనేజ్‌మెంట్, ఫార్మసీ కోర్సులకు సైతం భారీగా వెచ్చించాలి. ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఊదరగొడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉందని సంగతి గ్రహించాలి. ప్రస్తుత విద్యా సంస్థల యాజమాన్యాల ధన దాహం సామాన్య కుటుంబాలకు భారంగా మారిందని చెప్పవచ్చు.



బెస్ట్ అవైలబుల్ పథకం కింద సామాన్య కుటుంబాలకు ఇస్తున్న ఉచిత విద్యను ప్రభుత్వం దూరం చేసింది. ఫలితంగా అణగారిన కుటుంబాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫీజుల వసూళ్లపై ప్రభుత్వ పర్యవేక్షణ కొరవడడం, ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాల చెల్లింపులను నిఘా పరిధిలో చేర్చకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లపై నిఘా వేయడం, ఇన్‌కమ్‌ట్యాక్స్ దాడులు చేయడం వంటి చర్యలతో సామాన్యులను అప్పులఊబి నుంచి బయటపడే అవకాశం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

నేడు సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించే సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ పిలుపు నిచ్చారు. బుధవారం పాత బస్టాండ్‌లోని సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970 సంవత్సరంలో బెంగాల్‌లోనే కలకత్తా నగరంలో మే 30న సిఐటియు ఆవిర్భవించిందని తెలిపారు. త్యాగం... పోరాటం నినాదంతో 54 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తూ ఉందని చెప్పారు. ఉద్యోగులు, స్కీం వర్కర్లు, ఆప్కాస్, కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలపై సిఐటియు పనిచేస్తుందని తెలిపారు. దేశంలో, రాష్ట్రంలో కరువు, ఆపద వచ్చినప్పుడు సిఐటియు స్పందిస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఉద్యోగులకు వ్యతిరేకంగా నిర్ణయాలు చేసినప్పుడు వాటిపై పెద్ద ఎత్తున సమ్మెలో నిర్వహించిందని తెలిపారు. దేశంలో సమ్మె నిర్వహించినప్పుడు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, ప్రభుత్వ సంస్థలను కాపాడాలని సిఐటియు పోరాటం నిర్వహిస్తుందన్నారు. ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, పోస్టల్, రైల్వే, డిఫెన్స్, బ్యాంకులు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తూ ఉందనే పేర్కొన్నారు. ఈ తరుణంలో జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం వచ్చే ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కార దిశగా ఆలోచించే విధంగా ఉండాలని కోరారు. సమావేశంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, ఆటో నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** పట్టణంలో ఈనెల 30న నిర్వహించే సిఐటియు ఆవిర్భావ దినోత్సవం జయప్రదం చేయాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జి. ఏసుదాస్, సిఐటియు పట్టణ సహాయ కార్యదర్శి అబ్రహం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ త్యాగం... పోరాటం నినాదంతో 54 సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు సిఐటియు నిర్వహిస్తూ ఉందని చెప్పారు. సమావేశంలో సిఐటియు ఉపాధ్యక్షుడు హుస్సేన్ వల్లి , దివాకర్ , రవి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

భూ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ

ప్రజాశక్తి - బద్వేల్

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లె, చెన్నంపల్లి పంచాయతీలోని సర్వే నెంబర్లలో భూ కబ్జాదారులు దొంగ పట్టాలు తయారుచేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని అలాంటి వారిపై బద్వేల్, గోపవరం తహశీల్దార్లు, బద్వేల్ ఆర్‌డిఒ చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వారిని వెంటనే సస్పెండ్ చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని, భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని భూ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ డిమాండ్ చేశారు. బుధవారం బద్వేల్ పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో రోజురోజుకూ దొంగ పట్టాదారులు, నకిలీ పట్టాలు తయారుచేసి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని, వారికి రెవెన్యూ అధికారులు అండదండలు కూడా సమృద్ధిగా ఉన్నాయేమో అని అనుమానమొస్తుందన్నారు. బద్వేల్ మండలం చెన్నంపల్లి సర్వేనెంబర్ 1779 ,1779/1,18 01, 1802, ప్లాట్ నెంబర్లు 11 ,12 ,340, 189 ,190, 36. గోపవరం మండలం మడకలవారిపల్లె మహమూద్ కాలనీలో సర్వేనెంబర్ 985 ,869, 953. ప్లాట్ నెంబర్లు 330, 316, 329 ,91 ,32 ,145 ,146 ,119. ఎన్‌టిఒ కాలనీలో 30 ప్లాట్లు, అలాగే శ్మశాన స్థలంలో ఆర్యవైశ్య కమర్షియల్ కాంప్లెక్స్, బద్వేల్ మండలం సర్వేనెంబర్ 922/2.1.5. ఒక ఎకరం, మడకలవారిపల్లె 977/3 ,2.34. ఎకరాలు, సైనిక్ నగర్ సర్వేనెంబర్ 1779, ప్లాట్ నెంబర్ 85,86,101,102,2007. చెన్నంపల్లిలో అక్రమ నిర్మాణం 1581,284. ప్లాట్స్ , 954,969,970. సర్వే నెంబర్లలో దాదాపు 2000 ఎకరాలు కబ్జా గురవుతుంటే తహశీల్దార్‌లు, ఆర్‌డిఒ స్పందించకపోవడం దారుణమన్నారు. పట్టణంలో రోజురోజుకూ భూకబ్జాదారులు ఎక్కువైపోయి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. బద్వేల్ ఆర్‌డిఒ వచ్చిన తర్వాత కొందరి పైన ఎఫ్ఐఆర్ నెంబర్ :112/2022. మే 9, 2022 తేదీన 120 బి, 420,466,467,468 సెక్షన్లతో, బి.రమణారెడ్డి గోపవరం ఎమ్మార్వో 471,471బి,472,474,475 ఐపిసి సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి మిగతా వారి పైన చర్యలు లేకపోవడంతో విచ్చలవిడిగా నకిలీ పట్టాల తయారుచేసి స్థలాలు అమ్ముతున్నారన్నారు. మిగతా వారిని ఎందుకు కేసు నమోదు చేయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌డిఒ వచ్చిన తరువాత భూ కబ్జాదారులు విపరీతంగా దొంగ పట్టాలు తయారుచేసి విక్రయించుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారుల పైన సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేయించాలని, రోజురోజులూ ఎక్కువ అవుతున్నా నకిలీ పట్టాల సూత్రధారుల పైన తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని వారు కోరారు. లేనిపక్షంలో భూ పోరాట కమిటీ, డివైఎఫ్ఐ యువజన సంఘం మిగతా ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు ఆంజనేయులు, ఇమ్మానీలు, సురేంద్ర కెవిపిఎస్ నాయకులు సగిలిరాయప్ప, మహిళా సంఘం నాయకులు మోక్షమ్మ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బి.నారాయణ


నందూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న మూల మల్లికార్జునరెడ్డి


నందూరి సుబ్బారావు
సాహిత్యంలో కొత్త అందాలు
- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నందూరి సుబ్బారావు ఎంకి పాటలు తెలుగు సాహిత్యంలో ప్రణయ బావుకతకు,పదాల పొందికకు కొత్త అందాలు చేకూర్చాయని, ప్రతి పాటలో శృంగార మాధుర్యం తొణికిసలాడుతుందని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. నందూరి 67వ వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం బుధవారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో నందూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఎంకి పాటల్లో మాండలిక పదాల సొంపు, పొందిక తెలుగు నేలకు పరిచయమేనని, పల్లెపడచు పూలతో కొప్పు చుట్టి, రూపాయ బిళ్ళంతబొట్టు పెట్టి, గోచి చీర గట్టి వయ్యారంగా నడుస్తుంటే మనవాళ్లు ఎంకిలా ఉందని వర్ణించడం పరిపాటేనని అని చెప్పారు. ఎంకి నాయుడు బావల ప్రణయ సన్నివేశాలను నందూరి నవరసాలతో మహాద్భుతంగా రచించారని పేర్కొన్నారు. తెలుగింటి ఆడపడుచులకు మరో పేరు ఎంకి అని కొనియాడారు. కవి వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ 1926లో ప్రచురితమైన ఎంకి పాటలు పెద్ద దుమారం లేపాయని, ఎంకి పాటలు చదివితే ఎవరైనా కూని రాగాలు తీయాల్సిందేనని, అప్పట్లోఎంకి పాటలోక సంచలనమని, విశ్వనాథ లాంటివారే ఆ పాటల మోజులో పడ్డారంటే మనం అర్థం చేసుకోవచ్చునని, ఆ రోజుల్లో నందూరి సభల్లోఎంకి పాటలు పాడుతుంటే జనం తన్మయత్వంతో వినే వారని అన్నారు. కార్యక్రమంలో గంగయ్య, బాల ఓబయ్య, తపలిస్టు గంగయ్య, జ్యోతి జార్జి, కొండయ్య పాల్గొన్నారు.

కిరణ్ కిశోర్‌కు వైవీయూ డాక్టరేట్

ప్రజాశక్తి- కడప అర్బన్



యోగివేమన విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి మూరతోటి కిరణ్ కిశోర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తెలిపారు. జంతుశాస్త్ర విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.టి. వెంకట్రమణా రెడ్డి పర్యవేక్షణలో 'కాంప్రెహెన్సివ్ స్టడీ ఆఫ్ ద ఇంపాక్ట్ ఆఫ్ కాడ్మియం టాక్సిసిటి ఆన్ ఫిష్, లెబియో రోహిట' అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేస్తూ ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథ రెడ్డి కిరణ్ కిశోర్ ను, గైడ్ డాక్టర్ ఎ.టి. వెంకట్రమణారెడ్డి ని అభినందించారు.

కర్నూలు జట్టుపై నెల్లూరు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ సౌత్‌జోన్ సీనియర్ మెన్స్ వన్డే క్రికెట్ టోర్నీలో భాగంగా బుధవారం కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 8 వికెట్ల తేడాతో నెల్లూరు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 42.5 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని యుఎంఎస్. గిరినాథ్ 44 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టుకు చెందిన ఎస్.కె అతిక్ సల్మాన్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 162 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 21.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 165 పరుగులు సాధించి 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని కె. రేవంత్ రెడ్డి 81, నిఖిలేష్ 61 (నాటౌట్) పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని అంజి 2 వికెట్లు తీసుకున్నాడు. **63 పరుగుల తేడాతో కడప జట్టు విజయం..** కడపలోని కెఒఆర్ఎం మైదానంలో బుధవారం జరిగిన ఎసిఎ సౌత్ జోన్ సీనియర్ మెన్స్ వన్డే క్రికెట్ మ్యాచ్ లో చిత్తూరు జట్టుపై 63 పరుగుల తేడాతో కడప విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. ఆ జట్టులోని టి. వంశీకృష్ణ 83, షేక్ జహీర్ అబ్బాస్ 50 (నాటౌట్) పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని దీపన్ సాయినాథ్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 311 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 46.3 ఓవర్లలో 247 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని వై.తేజారెడ్డి 5 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్ ఎం డి అస్లాం 4, ఎస్. మొహమ్మద్ రఫీ 3 వికెట్లు తీసుకున్నాడు. **అనంతపురంలోనూ కడప జట్టు విజయం..** అనంతపురంలో బుధవారం జరిగిన ఎసిఎ సౌత్ జోన్ అండర్- 19 మెన్ వన్డేస్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 5 వికెట్ల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 40.5 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని చరణ్జిత్ 48 పరుగులు చేశాడు. కడప జట్టులోని ఏ. శ్రీ సాయి చరణ్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ బి. ప్రణవ్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 113 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింం కు దిగిన కడప జట్టు 24.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 115 పరుగులు చేసి 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని టి. సుదర్శన్ 25 (నాటౌట్) పరుగులు చేశాడు.


తలపడుతున్న కర్నూల్, నెల్లూరు జట్లు

అక్రమ సస్పెన్షన్లు వెంటనే ఎత్తివేయాలి : సిఐటియు


సమావేశంలో మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-కమలాపురం

ఆర్‌టిసి కార్మిక నాయకులపై విధించిన అక్రమ సస్పెన్షన్లను వెంటనే ఎత్తివేయాలని సిటిఐయు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్రికలో వచ్చిన చిన్న ప్రకటనను సాకుగా చేసుకుని సి. హెచ్.సుందరయ్య ఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులను, తణుకు డిపోలో మరో ఇద్దరు ముఖ్య నాయకులను ఆర్‌టిసి యాజమాన్యం సస్పెండ్ చేసిందన్నారు. శ్యాంసన్ (తణుకు) బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి – సుబ్బారావు, ఎన్ఎంయు తణుకు డిపో కార్యదర్శులను పత్రికలో ప్రకటన వచ్చిందనే పేరుతో సస్పెండ్ చేశారని తెలిపారు. వాట్సాప్ డిపిలో పోస్టర్ పెట్టారనే కారణంతో మంగళగిరి డిపోలో మహిళా కండక్టర్ పద్మావతిని అక్రమంగా తొలగించారని వాపోయారు. ఉద్యోగ సంఘ రాష్ట్ర నాయకులుగా ఉన్న వారిని సస్పెండ్ చేయడం చట్ట విరుద్ధం, ఏకపక్షం, అన్యాయమని పేర్కొన్నారు. అక్రమ చర్యలను ఆర్టీసి ఉద్యోగ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు వారిని వెంటనే ఉద్యోగాల్లో చేర్చు కోవాలని ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్‌టిసి యాజమాన్యం కార్మికులను, కార్మిక నాయకులను చీటికిమాటికి యథేచ్ఛగా సస్పెన్షన్ చేయడం అలవాటుగా మారిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయాన్ని అదునుగా తీసుకొని అనేకమందిని అక్రమంగా సస్పెన్షన్ చేశారన్నారు. ఎన్నికల ముందు కూడా డ్రైవర్, కండక్టర్లను పదుల సంఖ్యలో సస్పెన్షన్ చేశారన్నారు. ఆర్‌టిసిని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత కొందరు అధికారుల కార్మిక, ఉద్యోగ వ్యతిరేక చర్యలు మితిమీరి పోతున్నాయని తెలిపారు. వెంటనే సస్పెండ్ అయిన యూనియన్ నాయకులు, కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ లక్ష్మీదేవి, వెంకటేశ్వరి, ప్రభావతి, స్వాతి పాల్గొన్నారు.

ఎన్నికల కౌంటింగ్ రోజు దుకాణాలు తెరవరాదు : సిఐ

ప్రజాశక్తి-చెన్నూరు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ దృష్ట్యా దుకాణదారులు, హోటళ్ల యజమానులు 144 సెక్షన్ అమలులో ఉన్నందున మూసివేయాలని , లేకపోతే చర్యలు తప్పవని సిఐ పార్థసారథి అన్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హోటళ్ల యజమానులకు, దుకాణదారులకు సమావేశం ఏర్పాటు చేశారు. వారికి ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ విధానాల అమలులో భాగంగా ఎస్‌పి దేశాల మేరకు జూన్4న దుకాణాలు, హోటల్ మూసివేయాలని సూచించారు. అలాగే ప్రజలు ఎవరూ రోడ్లమీద గుంపులు గుంపులుగా ఉండరాదని, తగాదాలకు, అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కౌంటింగ్‌కు సహకరించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా కేంద్రంలో ప్రశా ంతంగా కౌంటింగ్ కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహ కరించాలని కడప డిఎస్‌పి షరీఫ్ కోరారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, నాయకుల సహకారంతో జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. అదేవిధంగా కౌంటింగ్‌కు నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 3న మధ్యాహ్నం నుంచి కడపలో ఇతర జిల్లాలకు చెందిన వారు ఎవరూ ఉండకూడదని చెప్పారు. ఆర్‌టిసి బస్సులను నగర శివార్ల వరకు నడుపుతారని తెలిపారు. జిల్లా మొత్తం 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో షాపులు మూసివేయాలని చెప్పారు. ఇతర జిల్లాల నుంచి ఎవరు రాకూడదని తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫంక్షన్ హాళ్లు, లాడ్జీలను పోలీసుల అనుమతి లేకుండా ఎవరికి ఇవ్వకూడదని పేర్కొన్నారు. జిల్లా అధికారుల సూచనల మేరకు మద్యం షాపులకు సడలింపులు ఇస్తామని చెప్పారు. కలెక్టర్ అనుమతి లేకుండా ఇతర వ్యక్తులు రాకూడదని తెలిపారు. నగర శివారులో ఏడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. సిసి కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. స్ట్రాంగ్ రూమ్ బయట నాలుగు అంచెల భద్రత ఉంటుందని తెలిపారు. పద్మవ్యూహం లాంటి టీమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలందరూ శాంతియుతంగా ఉండాలని కోరారు. ఎవరైనా అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూన్ 3న పార్టీ కార్యాలయాలు బంద్ చేసి సిసి కెమరాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఎటువంటి ర్యాలీలకు అనుమతి లేదన్నారు. కడప సబ్ డివిజన్‌లో నలుగురి మీద రౌడి షీటర్లు నమోదు చేశామని తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న డిఎస్‌పి షరీఫ్

స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ : డిఐఒ

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరంలో స్కానింగ్ సెంటర్లను పర్యవేక్షణ చేస్తున్నారని డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర్ కుమార్ తెలిపారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆర్‌డిఒ అనుమతితో సబ్ డిస్ట్రిక్ట్ అడ్వయిజరీ కమిటీ, సబ్ డిస్ట్రిక్ట్ మల్టీ మెంబర్ అప్రపెట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలో 81 స్కాన్ సెంటర్లున్నాయని పేర్కొన్నారు. ఈ స్కాన్ సెంటర్లను జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసుల ద్వారా వారి వారి షెడ్యూల్ ప్రకారం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కడప డివిజన్‌లో ఆరోగ్యశాఖ, ఐసిడిఎస్, పోలీసు వారి సహకారంతో డెకాయ్ ఆపరేషన్ కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా పిసి అండ్ పిఎన్ డిటి చట్టాన్ని ఉల్లంఘించిన వారికి తగిన శిక్ష పడుతుందని తెలిపారు. సెకండ్ ట్రై మిస్టర్ అబార్షన్స్ అయినవారి వివరాలు సేకరించి, వారు ఎక్కడ స్కాన్ చేయించినది, ఎక్కడ అబార్షన్లు చేయించుకున్నది తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్, ఆరోగ్య శాఖ వారు ఆడపిల్లల శాతం తక్కువ ఉన్న ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ సుధా, రేడియాలజిస్ట్ డాక్టర్ డేవిడ్ చక్రవర్తి, పీడియాట్రిషన్ డాక్టర్ బాలకృష్ణ, ఐసిడిఎస్ సిడిపి ఓ సునంద, లీగల్ ఎక్స్‌పెర్ట్, ఎన్‌జిఒలు, డెమో అరుణకుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐఒ డాక్టర్ ఉమామహేశ్వర్



గోడపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి

హనుమజ్జయంతి గోడ పత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జూన్ 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న ఉత్సవాల గోడపత్రాలను కడప పార్లమెంట్ సభ్యుడు వైయస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరించారు. పాత మార్కెట్‌లో వెలసిన పడమటి ఆంజనేయస్వామి దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి బుధవారం ఎంపీ గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమ జ్జయంతి సందర్భంగా వేకువజామునే స్వామి వారికి ప్రత్యేకపూజలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. సాయంత్రం స్వామిని గ్రామోత్సవం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు హాఫిజ్ చంద్రమౌళి, 22వ వార్డు కౌన్సిలర్ భార్గవి, ఆలయ కమిటీ సభ్యులు చలమారెడ్డి, దశరథ రామిరెడ్డి, సోమాల వీరాంజనేయులు, మురళి పాల్గొన్నారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు

గండిలో హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రంలో బుధవారం నుండి హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. జూన్ ఒకటో తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి వినోద్‌కుమార్

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పోలీస్ స్టేషన్‌లో రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం వద్దని పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ సూచించారు. సింహాద్రిపురం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రికార్డులను పరిశీలించారు. తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బాలికలు, మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సునీత

కౌమారదశపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రుతుక్రమం అనేది మహిళ శరీరంలో జరిగే సహజ పక్రియ అని, దీనిపట్ల కౌమరదశ బాలికలు అవగాహన కలిగి ఉండాలని సిడిపిఒ సునీత సూచించారు. ఐసిడిఎస్ వేంపల్లె శాఖ ఆధ్వర్యంలో రుతుక్రమం దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం వేంపల్లె గ్రామ సచివాలయంలో బాలికలు, మహిళలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమం పట్ల ఉన్న మూఢ నమ్మకాలు, అపోహలను విడనాడాలని కోరారు. అవగాహన లేకపోవడంతో చాలామంది నిరుపేద పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. చదువును కొనసాగించేందుకు స్వచ్ఛ అనే కార్యక్రమాన్ని ద్వారా ప్రభుత్వం ఆడపిల్లలకు నాప్కిన్స్ ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. కౌమర దశలో ఉన్న 10 నుండి 14 సంవత్సరాలకు చెరుకున్న ఆడ పిల్లలకు ప్రతి నెల రుతుస్రావం జరుగుతుందని తెలిపారు. అ సమయంలో శుభ్రత పాటించాలని కోరారు. రుతుస్రావం వల్ల ఆడ పిల్లలు ఏ రంగంలో కూడా వెనుకడుగు వేయరాదన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వం సబ్సిడీ ధరపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ మదనపల్లి ఎడిఎ దీక్షాకుమారి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలో జరుగుతున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ శాఖాధికారి మురళీమోహన్ తో కలిసి తనిఖీ చేశారు. రాచవేటివారి పల్లె, రెడ్డివారిపల్లె, తవళం రైతు భరోసా కేంద్రాలలో జరుగుతున్న పంపిణీ కార్యక్రమాలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాలలో పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ ఆధారంగా రైతులు వేరుశనగ పంటను సాగు చేస్తారని అన్నారు. వేరుశనగ విత్తనాలను రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నాదని తెలిపారు. విత్తనాలు తీసుకున్న రైతులు ప్రతి ఒక్కరూ వేరుశనగ పంటను సాగు చేసి సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు తీసుకున్న రైతులు కె-6 (తెల్ల రకం) విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని అన్నారు. విత్తనాల పంపిణీ **గాలివీడు :** రైతులు వేరుశనగ విత్తనకాయలను సద్వినియేగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మండెం మురళీధర్ పేర్కొన్నారు. నూలివీడు తలముడిపి కొర్లకుంట గ్రామాలలోని రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేశారు. మండలానికి 2075 క్వింటాళ్ల కే సిక్స్ విత్తన కాయలు 30 కేజీలు రూ.1710లు, 400 క్వింటాళ్ల నారాయణి 30 కేజీల బస్తా రూ.1746లు నగదును రైతు భరోసా కేంద్రాల్లో చెల్లించి విత్తనకాయలు తీసుకొని పోవాలని రైతులకు పేర్కొన్నారు.

అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు

కోర్టులో ఉన్న భూములనూ వదలని వైనం - చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

విజయవాడ-బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించి మండలంలోని పెదన పాడు, కోడూరు, సుంకేసుల, తిప్పలూరు గ్రామాల మీదుగా వెళ్లే ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించారు. జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి అవసరమైన మట్టిని రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండానే సదరు కాంట్రాక్టర్లు తవ్వకాలు చేపట్టారు. పెదనపాడు పొలంలోని 247-బి సర్వే నెంబర్లో గల ప్రభుత్వ స్థలంలోని గుట్టల నుండి అనుమతులకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. గత వారం రోజులుగా పెద్దపెద్ద యంత్రాలతో మట్టిని తవ్వుతూ వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సమీప గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. సహజ సంపదను కొల్లగొడుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 247-బి సర్వేనెంబర్‌లో గల కొంత భూమి ఎర్రగుంట్ల నగర పంచాయితీకి సంబంధించి డంపింగ్ యార్డ్ నిమిత్తం కేటాయించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును స్థానిక గ్రామ ప్రజలు అడ్డుకొని, దానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొన్నేళ్లుగా 247-బి సర్వే నెంబర్‌లోని భూమి కోర్టులో ఉన్నప్పటికీ సదరు రోడ్డు కాంట్రాక్టర్లు యథేచ్ఛగా మట్టిని తవ్వుతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోర్టులో ఉన్న భూమిలో మట్టి తవ్వకాలు జరుగుతుంటే రెవెన్యూ అధికారులు ఏమి చేస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని కోడూరు గ్రామ పొలంలో రోడ్డు నిర్మాణం చేసే భూములలోని మట్టిని వినియోగించేలా రెవెన్యూ అధికారుల ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని బేఖాతరు చేస్తూ సమీపంలోని గుట్టలను తవ్వడంపై ఆయా గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తు న్నారా అంటూ స్థానిక గ్రామస్తులు ఆగ్రహి స్తున్నారు. ఇప్పటికైనా మట్టి అక్రమ తవ్వకాలను ఆపాలని రెవెన్యూ అధికారులను ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మట్టిని తరలిస్తున్న భారీ యంత్రాలు

టాప్ ర్యాంక్‌ల సాధన టికెఆర్ జీవనజ్యోతికే సాధ్యం

నైతిక విలువలతో బోధన : ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి



టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్‌లో ఆట స్థలం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు నియోజకవర్గంలో ఏ పాఠశాలకు సాధ్యం కానీ మార్కులు సాధించడమే టికెఆర్ జీవన్‌జ్యోతి హైస్కూల్‌కు సాధ్యమని జీవనజ్యోతి విద్యాసంస్థల ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ టికెఆర్ హైస్కూల్‌ను జీవనజ్యోతి విద్యాసంస్థల్లో విలీనం చేశాక, ఆ పాఠశాల విలువలను ఏ మాత్రం తగ్గించకుండా చక్కటి విద్యతోపాటు క్రమశిక్షణతో కూడిన విద్యను అందజేస్తున్నామన్నారు. నేటి తరం పిల్లలు రేపటి ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడకుండా ఇష్టపడి చదివేలా పాఠశాల వాతావరణం తీర్చిదిదుతున్నామన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, మానసిక ప్రశాంతతను కలిగి ఉండేలా టికెఆర్ జీవన్ జ్యోతి హైస్కూల్ ఉందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా డి చిన్న గురుశేఖర్ యాదవ్ ఆయా సబ్జెక్టులలో నైపుణ్యంగల ఉపాధ్యాయులను ఎంపిక చేసుకొని ఇక్కడి విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందజే స్తున్నారన్నారు. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషియాలజీ సబ్జెక్టులతోపాటు లాంగ్వేజ్‌లపై ప్రత్యేకశ్రద్ధ తీసుకుం టున్నామన్నారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 594 మార్కులతో స్టేట్ టాపర్‌లలో ఒకరుగా తమ పాఠశాల విద్యార్థి కె.విజయ్ చరణ్ నిలిచాడన్నారు. 27 మంది పది పరీక్షలు రాస్తే అందులో 19 మందికి 500పై మార్కులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు పట్టణంలోని ఏ పాఠశాల కూడా ఇంత అద్భుత ఫలితాలను సాధించలేదని తెలిపారు. అబాకస్, ఒలంపియాడ్, ఐఐటి ఫౌండేషన్‌కు బేసిక్ ఎడ్యుకే షన్‌ను నాల్గవ తరగతి నుంచి పిల్లలకు బోధిస్తున్నామన్నారు. సీనియర్ ఫ్యాకల్టీ, వారికి తగ్గట్టు మంచిజీతాలు అందించడంలో తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. మంచి జీతాలు ఇస్తున్నప్పుడు మంచి ప్రతిభను చూపించి పిల్లల ఉన్నతికి కృషి చేస్తారన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని గురుదేవ్ రామిరెడ్డి కోరారు. అడ్మిషన్లకు 96037 37014, 94409 14765 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



గురుదేవ్ రామిరెడ్డి



టికెఆర్ జీవన జ్యోతి హైస్కూల్ భవనం

వినోదంతో కూడిన విజ్ఞానం : జెవివి



సైన్స్ మ్యాజిక్ చూపుతున్న జెవివి జిల్లా కార్యదర్శి బాల బయన్న

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వినోదంతోపాటు విజ్ఞానం అనే అంశంపై బుధవారం జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న సైన్స్ మ్యాజిక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినోదంతో కూడిన విజ్ఞానం రావాలంటే చిన్నచిన్న సైన్స్ మ్యాజిక్కుల ద్వారా పిల్లలకు నేర్పించవచ్చన్నారు. అనేక సైన్స్ మ్యాజిక్స్ చేసి అందులోని లాజిక్ తెలియజేస్తూ పిల్లలతో అనేక అంశాలను చేయించారు. ఈ విధంగా చేయించడం ద్వారా పిల్లల్లో సృజనాత్మక శక్తి పెరిగి మూఢనమ్మకాల్లేని ఒక మంచి శాస్త్రీయ సమాజం ఏర్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎన్.ఉమాదేవి, ఎస్ ఫరూక్, ఎం చంద్రశేఖర్ రెడ్డి, ఎం రాంప్రసాద్ రెడ్డి, ఆర్ రామలింగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

కడప అర్బన్ : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని జెవివి నాయకులు రంగనాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన వేసవి శిక్షణలో భాగంగా పర్యావరణం వల్ల వచ్చే నష్టాల గురించి విద్యార్థులకు వివరించారు. పర్యావరణం అంటే అర్థం భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్న ప్రకృతి అన్నారు. ఇది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకమన్నారు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పెరుగుతున్న నష్టలకు ముఖ్య కారణాలు జల కాలుష్యం, వాయు కాలుష్యం, భూ కాలుష్యమని పేర్కొన్నారు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉందని తెలిపారు. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదన్నారు. ఈ పర్యావరణ కాలుష్యం వల్ల మనుషులే కాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయని పేర్కొన్నారు. వాయు కాల్యుష్యం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరిత వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపో తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పవన్‌కుమార్, అసిస్టెంట్ లైబ్రేరియన్ నాదెండ్ల బాబ్జి, లైబ్రేరియన్స్ సుబ్రమణ్యం, సురేష్, జేమ్స్, సిబ్బంది సుబ్బమ్మ, కె.శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రంగనాయకులు

విభిన్న ప్రతిభావంతుల విద్యపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కలకడ

విభిన్న ప్రతిభావంతుల విద్య కొరకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు ఎంఇఒలు మునేంద్రనాయక్, రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కలకడ పరిసర ప్రాంతాలలో విభిన్న ప్రతిభావంత పిల్లల కోసం బడిబాట కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల ఇంటికి పరిమితం కాకుండా వారిలో మానసికంగా శారీరకంగా అభివృద్ధిని తీసుకురావాలనే ఉద్దేశంతో డిఇఒ శివప్రకాష్‌రెడ్డి, ఐఇ కో-ఆర్డినేటర్ జనార్దన్ ఆదేశాల మేరకు ప్రతి విభిన్న ప్రతిభావంత పిల్లలను బడిలో చేర్పించి ఎన్‌రోల్‌మెంట్ చేయుటకు ఐఆర్‌టిలు ఎం. లక్ష్మిన రసమ్మ, సి.విశ్వనాథలు ఇంటింటి సర్వే చేపట్టారు. చదువుకు దూరంగా ఉన్న వారిని బడిలో చేరిన తర్వాత వారికి ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ పథకాల రాయితీలు, సదుపాయాలు, అమలవుతున్న శిక్షణలు తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమం ఈనెల 1 నుంచి జూన్ 9 వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రతి తల్లి దండ్రులకు విభిన్న ప్రతి భావంతుల గురించి సమాచారం ఐఇఆర్‌టి సిబ్బందికి తెలియజేసి ప్రతి ఒక్క విభిన్న ప్రతి భావంత బాలబాలికలు విద్యను అభ్యసించేందుకు సహకరించాలని తెలిపారు. ఇప్పటివరకు పాఠశాలలో ఎన్‌రోల్‌మెంట్ జరగని 20 మంది విభిన్నప్రతిభావంత పిల్లలను గుర్తించి వారిని త్వరలో పాఠశాల లో చేర్పించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలం హెడ్ క్వార్టర్స్‌లో ఒక భవిత కేంద్రం ఉంటుందని భవిత కేంద్రం వలన కలిగే ప్రయోజనాలను కూడా తల్లిదండ్రులకు వివరించారు. ఉచితంగా ఉపకరణాలు అందిస్తారని, ప్రతి నెల రూ.300చొప్పున రవాణా భత్యం, వీరితోపాటు వచ్చే వారికి ఎస్కార్ట్ అలివేషన్స్ క్రింద రూ.300లు చెల్లిస్తారని చెప్పారు. బాలికలకు ప్రతినెల ప్రత్యేకంగా రూ.200 అందిం చడం జరుగుతుందని అన్నారు. వినికిడి, దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబ్‌లు పంపిణీ, వైక ల్యం ఉన్న వారిలో సదరం సర్టిఫికెట్ పత్రం పంపిణీ, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీపై శిక్షణ అందిస్తారని తెలిపారు.

చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- గాలివీడు : స్థానిక గేటు వద్ద బుధవారం చిన్నపిల్లల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఆయుష్ ఆసుపత్రి వైద్యాధికారి ఎం.మహేష్‌నాయక్ పేర్కొన్నారు. చిన్నపిల్లల్లో చిన్న చిన్న జబ్బులు, బలహీ నతపై అనేకమంది బాధపడుతుంటారని వారి కోసం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి పిల్లలను పరీక్షించి మందులు, టానిక్‌లు పంపిణీ చేశామని తెలిపారు. బుధవారం కూరగాయల సంత కావడంతో చుట్టుపక్క మండలాల నుంచి గ్రామాల నుంచి ప్రజలు సంతకు వచ్చి సంతలో ఉన్న తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలని తీసుకుని వచ్చి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినోదం చేసుకున్నారని అన్నారు. 120 మంది చిన్నారులకు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్యం చేసి వారి ఉచిత మందులు పంపిణీ చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, పవన్‌కల్యాణ్, సోమశేఖర్, లక్ష్మీప్రసన్న, స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

వైఎస్.షర్మిల గెలుపు ఖాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప ఎంపీగా వైఎస్ షర్మిల గెలుపు ఖాయమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. స్థానిక కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ చివరి దశకు వచ్చిందన్నారు. బిజెపి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందన్నారు. ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చే పరిస్థితులు కనిపించడంలేదన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఇండియా వేదిక కేంద్రంలో గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. పార్లమెంట్‌లో 272 ఎంపీ సీట్లు మ్యాజిక్ ఫిగర్ అన్నారు. సింగిల్‌గ ఏ పార్టీ మ్యాజిక్ ఫిగర్‌ను దాటే అవకాశంలేదన్నారు. కేంద్రంలో ఈసారి సంకీర్ణ ప్రభుత్వం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బలమైన పార్టీలున్న ఇండియా వేదిక వస్తుందన్నారు. బిజెపి ఆధ్వర్యంలో బలమైన పార్టీలు స్వల్పంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఈ సారి 2014 పరిస్థితులు పునరావృతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. వైసిపికి 60 నుండి 80సీట్లు వచ్చే అవకాశం కనిపిస్తోందని తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్ల శాతం గణనీయంగా పెంచుకుందన్నారు. చీరాల, మడకసిర అసెంబ్లీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలుచుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నజీర్ మాట్లాడారు.

ఎన్నికల ఫలితాల్లో ఇండియా వేదికదే విజయం

ప్రజాశక్తి-గుర్రంకొండ

ఎన్నికల్లో ఫలితాల్లో కేంద్రంలో ఇండియావేదికదే విజయమని అన్నమయ్య డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్ అన్నారు. బుధవారం గుర్రంకొండలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు జరిగిన ఐదు విడుతల సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక వైపే దేశ ప్రజలు మొగ్గు చూపారని అన్నారు. ఒకటో తేదీ జరిగే చివరి విడతలో కూడా ప్రజలు కూటమి వైపే మొగ్గుచూపుతారని, అన్ని సర్వేలు కూడా ఇదే చెబుతున్నాయని చెప్పారు. అబద్ధాలను అభివృద్ధిగా చెప్పుకుంటూ నరేంద్ర మోడీ కొనసాగించిన వంచన పాలనను ప్రజలు చరమగీతం పాడుతారని అన్నారు. రాహుల్‌గాంధీని ఈ దేశానికి ప్రధానిగా చూడాలన్న దేశ ప్రజల కోరిక తప్పక నెరవేరుతుందని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా కాంగ్రెస్ పార్టీ కోసం నిజాయితీగా జెండా మోసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గుర్రంకొండ మండల అధ్యక్షులు సమీరుద్దీన్, ఖాదర్‌బాషా, అమానుల్లా ఖాన్, అర్షద్ అలీ, మహమ్మద్ షానవాజ్, మహమ్మద్ సమీద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న శైలభాను

తరగని, కరగని సంపద విద్య మాత్రమే

ప్రజాశక్తి - కడప అర్బన్

మనం ఎన్ని దానాలు చేసినా అవి తాత్కాలికమే, కానీ విద్యను దానం చేయడం వల్ల అది తరగని సంపద అని స్ప్రెడ్ స్మైల్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు శైలాభాను పేర్కొన్నారు. జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవ సమితి అధ్వర్యంలో బుధవారం బాలాజీ నగర్‌లో ప్రాజెక్ట్ కిమద్రాలో భాగంగా నిర్వహిస్తున్న సమ్మర్ ఎడ్యుకేషన్ క్యాంప్‌నకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో విద్యా దానానికి మించిన ఉత్తమ సేవ మరొకటి లేదన్నారు. విద్య వల్ల వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో భాగంగా ది ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ సేవ చేయడానికి మా దగ్గర వసతి లేదని, చాలామంది భ్రమ పడుతుంటారని పేర్కొన్నారు. కనీసం మీ చుట్టుపక్కల వెనుకబడిన కుటుంబాల్లో ఉన్న నలుగురు పిల్లలకి విద్యను బోధించినా అది ఉన్నతమైన సేవ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సుజిత, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్స్ సంస్థ సభ్యులు రోహిత్, యుగంధర్, నికిత, వసంత, వినోద్ పాల్గొన్నారు.

తాగునీటి బోరు మోటర్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-కలికిరి :

స్థానిక మండలంలోని మర్రికుంటపల్లి గ్రామ పంచాయతీలో తాగునీటి బోర్లకు మరమ్మతులు చేసినట్లు సర్పంచ్ రెడ్డిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని కడియాల వాండ్లపల్లిలో మంచినీరు బోరు మరమ్మతుకు రావడంతో వెంటనే మరమ్మత్తులు చేయించి తాగు నీటి సమస్య తీర్చామని అన్నారు. వీరపల్లి వాండ్లపల్లెలో మోటార్ మర మ్మత్తుకు గురి కావడంతో అక్కడ నూతన మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఎక్కడ మంచి నీటి సమస్య రాకుండా వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల సమస్య బాధ్య తగా తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

శ్రీనివాసపురంలో నాకాబందీ

ప్రజాశక్తి-చిన్నమండెం : శ్రీనివాసపురంలో కేంద్ర బలగాలతో కలిసి నాకాబందీ నిర్వహించినట్లు ఎస్ఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ప్రతి ఇంటిని, వీధులను,పొలాలను క్షుణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా గ్రామాల్లో ప్రజలంతా శాంతి యుతంగా ఉండాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందుకు నలుగురుకు మించి ఎక్కడా గుంపులుగా ఉండకూడదన్నారు. ర్యాలీలు, బాణసంచా పేల్చడం నిషేధమన్నారు. ఎన్నికల ఫలితాలను ఇళ్లలోని టివిల్లో వీక్షించాలని సూచించారు.